హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర: 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.158	230	262
సూర్యాపేట	రూ. 150	220	250
నల్లగొండ	రూ.158	230	260

ఉష్ణోగ్రత గరిష్ఠం 39.5 । కనిష్ఠం 24.2

వేలాది మంది కార్యకర్తలు. వందలాది వాహనాలతో ర్యాలీలు, ప్రదర్శనలకు వేళయింది. అంగ, అర్ధ బల నిరూపణ చేసుకునేందుకు సమయం ఆసన్నమైంది. పార్టీల అగ్రనేతలు, లేదంటే జాతీయ, రాష్ట్రస్థాయి నేతలను తీసుకొచ్చి నామినేషన్లు వేసేందుకు ఆయా పార్టీల అభ్యర్థులు సర్వం సిద్ధం చేసుకుంటున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని నల్లగొండ, భువనగిరి పార్లమెంట్ స్థానాలకు ఆయా పార్టీలు ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించగా, నామినేషన్ల తేదీ దగ్గరపడుతుండడంతో అన్ని ఏర్పాట్లను చేసుకుంటున్నారు. నామినేషన్ల ఘట్టానికి మంచి మహూర్తం కోసం వేదపండితులను ఆశ్రయిస్తున్నారు.

-(ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)



ముహూర్తం ఖరారు

- 18వ తేదీ నుంచి నామినేషన్లకు సిద్ధమవుతోన్న అభ్యర్థులు
- శుభ ఘడియలు అయిదు రోజులే అంటున్న పండితులు
- ఆ రోజుల్లోనే నామినేషన్ల దాఖలుకు సన్నాహాలు
- నామినేషన్లకు పార్టీల ముఖ్యనేతలు హాజరయ్యేలా కసరత్తు
- కాంగ్రెస్ అభ్యర్థుల నామినేషన్లకు తేదీలు ఖరారు

లోక్‌సభ ఎన్నికల కీలకఘట్టానికి రంగం సిద్ధమైంది. ఈ నెల 18న నోటిఫికేషన్ విడుదలకు అధికార యంత్రాంగం సన్నద్ధమవుతుంటే, అదే రోజు నుంచి నామినేషన్ల ఘట్టం మొదలు కానుంది. ప్రధాన పార్టీలు ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించడంతో ప్రచారం కొనసాగుతోంది. ఈ నెల 18వ తేదీ నుంచి 25వరకు మాత్రమే నామినేషన్ల దాఖలుకు అవకాశం ఉండడంతో శుభముహూర్తాలు, పేరుబలాలు చూసుకొని నేతలు నామినేషన్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు. వేదపండితులను ఆశ్రయిస్తూ అనువైన తేదీలను తెలుసుకుంటున్నారు. ప్రధాన పార్టీల నేతలు నామినేషన్ రోజే తమ సత్తా చాటేలా భారీ ర్యాలీలు, కీలకనేతల ఆధ్వర్యంలో బహిరంగసభలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. నామినేషన్ల ఘట్టానికి తెరలేవనుండడంతో లోకసభ సమరం వేడెక్కనుంది.

18 నుంచి నామినేషన్ల దాఖలు

ఎన్నికల షెడ్యూల్ ప్రకారం ఈ నెల 18 నుంచి 25వరకు అభ్యర్థులు నామినేషన్ల దాఖలు చేయాల్సి ఉంటుంది. ఈ ఎనిమిది రోజుల్లో తమ పేరు బలం, పార్టీ బలం, జన్మనక్షత్రాల ప్రకారం ఏరోజు నామినేషన్ వేస్తే సత్ఫలితాలుంటాయని కోరుతూ అభ్యర్థులు వేదపండితులను ఆశ్రయిస్తున్నారు. పండితుల సూచనల ప్రకారం, మరోవైపు పార్టీ అధిష్ఠానాల నుంచి వస్తోన్న ఆదేశాల మేరకు నామినేషన్ల దాఖలుకు సిద్ధమవుతున్నారు. వేదపండితులు పేర్కొంటున్న ప్రకారం 19, 23, 25వ తేదీలు తిథి, నక్షత్రాల ప్రకారం శుభగడియలు కావని, ఆ రోజుల్లో నామినేషన్లు వేయడం సబబు కాదని చెబుతుండడంతో ఆ రోజుల్లో నామినేషన్లుండే అవకాశం లేదు. 18, 20, 21, 22, 24 తేదీల్లో శుభఘడియలుండడంతో ఈ తేదీల్లో అభ్యర్థుల జాతకాల ప్రకారం అత్యంత శుభదినం ఉన్నరోజు నామినేషన్ వేసేందుకు సిద్ధమవుతున్నారు.

నామినేషన్లకు అభ్యర్థులు సిద్ధం

కాంగ్రెస్ భువనగిరి అభ్యర్థి చామలకిరణ్‌కుమార్‌రెడ్డి ఈ నెల 21న, సీపీఎం అభ్యర్థి ఎండీ జహంగీర్ 19న, నల్లగొండ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి 24న నామినేషన్లు దాఖలు చేయాలని నిర్ణయించారు. వీరి నామినేషన్ల కార్యక్రమాలకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డితోపాటు పార్టీ జాతీయనేతలు హాజరవుతారని చెబుతున్నారు. వీలైతే నామినేషన్ల దాఖలు రోజు పార్లమెంట్ నియోజకవర్గకేంద్రాల్లో బహిరంగసభలు నిర్వహించాలని యోచిస్తున్నారు. అయితే మే మొదటివారం లో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీ పర్యటన ఖరారైతే బహిరంగసభల తేదీలను మార్చే అవకాశం కనిపిస్తోంది. మరోవైపు నల్లగొండ నుంచి బీజేపీ అభ్యర్థిగా బరిలో ఉన్న శానంపూడి సైదిరెడ్డి కూడా 22 లేక 24న నామినేషన్ దాఖలు చేసే అవకాశం కనిపిస్తోంది. ఈయన నామినేషన్ రోజునే నల్లగొండలో భారీ బహిరంగసభ నిర్వహించి, బీజేపీ దిగ్గజనేత, తమిళనాడు పార్టీ అధ్యక్షుడు అన్నామలైని తీసుకురావాలని యోచిస్తున్నారు. భువనగిరి లోక్‌సభ అభ్యర్థి డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ నామినేషన్‌కు సైతం కీలక జాతీయనేతను ఆహ్వానిస్తున్నట్లు చెబుతున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థులు కంచర్ల కృష్ణారెడ్డి, క్యామమల్లేశ్ నామినేషన్ల కార్యక్రమాలకు కేటీఆర్ రానున్నట్లు చెబుతున్నారు. మాజీ సీఎం కేసీఆర్ సైతం జిల్లాలో ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొనేలా ప్రణాళిక ఖరారు చేస్తున్నట్లు పార్టీనేతలు చెబుతున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంలో కేంద్రాల నిర్వాహకులు, మార్కెట్ అధికారులు విఫలమయ్యారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా ప్రతీ సంవత్సరం వేలాది రూపాయల కమీషన్ పొందుతున్న కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు రైతులకు టార్పాలిన్లు, ప్యాడీ క్లీనర్లు అందుబాటులో ఉంచకుండా వ్యవసాయ మార్కెట్లపైనే ఆధారపడుతున్నారు.

- మోత్కూరు, గుండాల



గుండాల మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రంలో కిరాయి యంత్రంతో ధాన్యం పడుతున్న రైతులు

కమీషన్ నిర్వాహకులకు.. ఖర్చు రైతులకు

- పాత పద్ధతుల్లోనే ప్యాడీ క్లీనింగ్
- సాంకేతికత పెరిగినా.. మారని తీరు
- కొనుగోలు కేంద్రాల్లో అందుబాటులో లేని ప్యాడీ క్లీనర్లు
- అధునాతన ప్యాడీ క్లీనర్లు అద్దెకు తెచ్చుకుంటున్న రైతులు

వ్యవసాయ మార్కెట్లు ఇచ్చే టార్పాలిన్లు సరిపోక వర్షాలు కురిస్తే కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దవుతోంది. ఇక ప్యాడీ క్లీనర్ల విషయానికొస్తే తమ వద్ద ఉన్న పాత మోడల్ ప్యాడీ క్లీనర్లను కేంద్రానికి ఒకటి చొప్పున ఇస్తున్నారు. అందులో కొన్ని పని చేస్తుండగా, మరికొన్ని పని చేయడం లేదంటున్నారు. దీంతో రైతులు ప్యాడీ క్లీనర్లు అద్దెకు తెచుకుని ధాన్యం శుభ్రం చేస్తున్నారు.

ఆధునిక ప్యాడీ క్లీనర్లు అందుబాటులోకి వచ్చినా..

వ్యవసాయ రంగంలో రైతులకు శ్రమ తగ్గి, పని సులువు అయ్యేలా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేసిన ఎన్నో రకాల యంత్రాలు తయారు చేస్తున్నారు. అందుబాటులోకి వచ్చిన అధునాతన యంత్రాల్లో ప్యాడీ క్లీనర్ కూడా ఉంది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన ప్యాడీ క్లీనర్‌తో ఎక్కువ మంది కూలీలు అవసరం లేకుండా, తక్కువ శ్రమతో తక్కువ సమయంలో ఎక్కువ ధాన్యం శుభ్రమవుతుంది. ఆధునిక ప్యాడీ క్లీనర్లు అందుబాటులోకి వచ్చినా వ్యవసాయ మార్కెట్లు కాలం చెల్లిన పాత మోడల్ యంత్రాలనే వాడుతున్నాయి. మార్కెట్లు ఇచ్చిన యంత్రాలు పని చేయకపోతే కేంద్రాల నిర్వాహకులే మరమ్మతు చేయించుకోవాలని చెబుతుండటంతో వారు వాటిని పక్కన పడేశారు. పాత మోడల్ క్లీనర్లతో ధాన్యం శుభ్రం చేయడానికి ఎక్కువ కూలీలు, ఎక్కువ సమయం పడుతుండటంతో రైతులు ప్రైవేటు వ్యక్తుల వద్ద నూతన ప్యాడీ క్లీనర్లను అద్దెకు తెచ్చుకుంటున్నారు. మోత్కూరు మండలంలో సదర్శాపురం, దాచారం గ్రామాల ఐకేపీ కేంద్రాలకు మార్కెట్ నుంచి ఇచ్చిన ప్యాడీ క్లీనర్లు పనిచేయక పోవడంతో రైతులు నూతన ప్యాడీ క్లీనర్లు అద్దెకు తెచ్చుకుని ధాన్యం శుభ్రం చేస్తున్నారు. అడ్డగూడూరు మండలం చౌళ్లరామారం ఐకేపీ కేంద్రంతో ప్యాడీ క్లీనర్ లేక రైతులు ట్రాక్టర్‌కు అమర్చిన ఫ్యాన్ ద్వారా గంటకు రూ.800అద్దె చెల్లించి ధాన్యం శుభ్రం చేసుకుంటున్నారు. ఆధునిక యంత్రాలు వాడుకలోకి వచ్చాక కూడా ప్రభుత్వం పాత కాలం నాటి యంత్రాలనేకొని వ్యవసాయ మార్కెట్లకు అందిస్తుండటంతో అటు ప్రజా ధనం వృథాకావడంతోపాటు ఇటు రైతులకు ప్రయోజనం లేకుండా పోతుందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఆధునిక ప్యాడీ క్లీనర్లు అందించాలంటున్న రైతులు

ఫ్యాన్లకు కాలం చెల్లినట్టుగానే పాత మోడల్ ప్యాడీ క్లీనర్లకు కూడా కాలం చెల్లిందని రైతులంటున్నారు. ప్రైవేటు వ్యక్తులకు ఆధునిక ప్యాడీ క్లీనర్లకు గంటకు రూ.వెయ్యి అద్దె చెలిస్తున్నామని, మార్కెట్ కమిటీలు, ఐకేపీ కేంద్రాలు ఆధునిక ప్యాడీ క్లీనర్లు తెచ్చి ఉచితంగా ఇవ్వకపోయినా గంటకు రూ.ఐదు వందలు అద్దె తీసుకున్నా తమకు లాభమే కదా అంటున్నారు.



ప్యాడీ క్లీనర్ పని చేయడం లేదు

గుండాల ధాన్యం కొనుగోలు కేంద్రంలో ప్యాడీ క్లీనర్ పని చేయడం లేదు. దీంతో ప్రైవేటు ప్యాడీ క్లీనర్‌తో ధాన్యాన్ని పడుతున్నాం. దీంతో మాపై అదనపు భారం పడుతుంది.

- తూనం నరేశ్ రైతు, పాచిల్ల, మం.గుండాల



గంటకు రూ.1000 చెల్లిస్తున్నాను

ధాన్యం కొనుగోలు కేంద్రంలో ప్యాడీ క్లీనర్ తుప్పు పట్టిపోయింది. దీంతో ధాన్యం పట్టడానికి ప్యాడీ క్లీనర్ లేకపోవడంతో తప్పని పరిస్థితుల్లో ప్యాడీ క్లీనర్‌ను కిరాయికి తీసుకుని గంటకు రూ.1000 చెల్లించాల్సి వస్తుంది.

- ఉడుగుల ఎల్లయ్య, వెల్మజాల, మం.గుండాల

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా

ప్యాడీ క్లీనర్లు పని చేయని విషయమై జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరిస్తా. త్వరలో ప్యాడీ క్లీనర్లను మరమ్మతు చేయించి రైతులకు అందుబాటులోకి వచ్చే విధంగా చూస్తా.

- నాగయ్య, సీఈవో, పీఏసీఎస్, గుండాల

గతేడాది నుంచే మార్కెట్లోకి అధునిక ప్యాడీ క్లీనర్లు



చౌళ్ల రామారంలో ఫ్యాన్‌తో ధాన్యం శుభ్రం చేస్తున్న రైతులు

రైతులు పండించిన ధాన్యాన్ని శుభ్రపర్చేందుకు మొదట్లో ఫ్యాన్లు ఉపయోగించే వారు. ఆ తర్వాత ప్యాడీ క్లీనర్లు (జల్లెడలు) వచ్చాయి. ఈ ప్యాడీ క్లీనర్లతో ధాన్యం శుభ్రం చేయడానికి ముగ్గురు నలుగురు వ్యక్తులు ధాన్యం గంపలతో ఎత్తి జల్లెడపై పోస్తే, మరో ముగ్గురు నలుగురు శుభ్రమై వచ్చిన ధాన్యం ఎత్తివేరేచోట రాశి పోయాల్సి ఉంటుంది. ఇప్పుడు మార్కెట్లో(వాడుకలో)కి వచ్చిన ప్యాడీ క్లీనర్‌తో పైపు ధాన్యం రాశి మధ్యన ఉంచి ఒక వ్యక్తి ధాన్యాన్ని పైపు దగ్గరకు లాగితే చాలు ధాన్యం శుభ్రమై రాశి పడుతుంది. ఈ యంత్రంతో కూలీల అవసరం లేకపోగా శ్రమ తగ్గడంతోపాటు సమయం కూడా ఆదా అవుతోంది. ఆధునిక ప్యాడీ క్లీనర్‌కు గంటకు రూ.1000 అద్దె చెల్లిస్తున్నారు. గంటకు 60 నుంచి 70 బస్తాల ధాన్యం శుభ్రమవుతుంది.

ఏపీ నుంచి వచ్చే ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయాలి

కోదాడ రూరల్, ఏప్రిల్ 12: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి వచ్చే ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, నగదుతో పాటు ఓటర్లను ప్రలోభపెట్టే ఇతర దుస్తులు, ఇతర సామాగ్రిని తరలిస్తుంటే గుర్తించి స్వాధీనం చేసుకోవాలని కలెక్టర్ ఎస్ వెంకటరావు ఆదేశించారు. శుక్రవారం మండలంలోని రామాపురం క్రాస్‌రోడ్డులోని అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సిబ్బందికి కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. అనంతరం నల్లబండగూడెం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. కొనుగోలు కేంద్రానికి వచ్చిన ధాన్యాన్ని వెంటనే కాంటా వేసి మిల్లులకు తరలించాలని కోరారు. గ్రామంలోని పోలింగ్‌స్టేషన్ కేంద్రాన్ని కూడా కలెక్టర్ పరిశీలించారు. పార్లమెంట్ ఎన్నికల నాటికి ఓటు వేసేందుకు వీలుగా పోలింగ్‌కేంద్రాల్లో వసతులు కల్పించాలని, ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. అనంతరం కొమరబండ వై జంక్షన్ వద్ద వాటర్ డే సందర్భంగా మొక్కలకు నీరు పెట్టారు. కలెక్టర్ వెంట ఆర్డీవో సూర్యనారాయణ, తహసీల్దార్ సాయిగౌడ్, మునిసిపల్ కమిషనర్ రమాదేవి, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ లక్ష్యాన్ని త్వరగా పూర్తి చేయాలి

మునగాల రూరల్: రైస్‌మిల్లు యజమానులు సీఎంఆర్ లక్ష్యాన్ని త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటరావు కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని బాలాజీ రైస్‌మిల్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం బరాఖత్‌గూడెంలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. అమ్మ ఆదర్శ పాఠశాల పనులను త్వరగా చేపట్టాలన్నారు. ఆయన వెంట కోదాడ ఆర్డీవో సూర్యనారాయణ, తహసీల్దార్ ఆంజనేయులు, ఎంపీడీవో రమేష్, దీన్‌దయాల్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రామారావు పాల్గొన్నారు.



కోదాడ మండలం నల్లబండగూడెంలో ఐకేపీ కేంద్ర నిర్వాహకులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరావు

తాగునీరు పొదుపుగా వాడుకోవాలి

సూర్యాపేట(కలెక్టరేట్) : తాగునీటిని పొదుపుగా వాడుకోవాలని కలెక్టర్ వెంకటరావు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ సమీపంలోని అవంతపురం నుంచి ఇమాంపేట వాటర్‌ప్లాంట్‌కు వచ్చే మిషన్ భగీరథ వాటర్ పంపింగ్ మెయిన్‌పైప్‌లైన్ గరిడేపల్లి వద్ద లీకేజీ ఏర్పడిందని పేర్కొన్నారు. దీని కారణంగా ఇమాంపేట నీటి శుద్ధి కేంద్రంలో శనివారం సాయంత్రం నుంచి నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. సూర్యాపేట, కోదాడ, మునిసిపాలిటీలు, సంబంధిత మండలాలైన చిలుకూరులోని 19 గ్రామాలు, కోదాడలో 24, అనంతగిరి 24, మునగాల 32, నడిగూడెం 17, పెన్‌పహాడ్ 52, సూర్యాపేట పరిధిలోని 17 గ్రామీణ ఆవాసాలకు మిషన్ భగీరథ తాగు నీటి సరఫరా నిలిపివేస్తామన్నారు. ఈనెల 15వతేదీ ఉదయం నుంచి పునరుద్ధరణ జరుగుతుందని ప్రజలు సహకరించాలన్నారు. కోదాడ మునిసిపాలిటీల్లో 35 వార్డులకు 12 వార్డులకు నీటి ఇబ్బంది ఉంటుందని అదేవిధంగా సూర్యాపేట మునిసిపాలిటీల్లో 48 వార్డులకు 38 వార్డుల్లో నీటి ఇబ్బంది ఉంటుందని అధికారులు వాటర్‌ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. నీటి ఇబ్బందులు ఉంటే సూర్యాపేట టెక్నికల్ అధికారి ఏఈ వరుణ్‌కుమార్ సెల్‌నెంబర్ 6300202057, కోదాడ టెక్నికల్ అధికారి రాజారెడ్డి సెల్ నెంబర్ 8374454641ను సంప్రదించాలన్నారు.

ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు కలుగొద్దు



మామిళ్లగూడెంలో ఐకేపీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ప్రియాంక

మోతె / చివ్వెంల, ఏప్రిల్ 12 : ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు సమయంలో రైతులకు ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ ప్రియాంక అన్నారు. శుక్రవారం మండలంలోని మామిళ్లగూడెం, మోతె గ్రామాల్లో ఐకేపీ ద్వారా ధాన్యం విక్రయాలు జరుపుతున్న కేంద్రాలను పరిశీలించారు. మండల వ్యాప్తంగా ఎన్ని కేంద్రాలు ఉన్నాయి, నిర్వహణ, ఎన్ని క్వింటాళ్ల ధాన్యం విక్రయాల తీరు చెల్లింపుల విషయాలను అడిగితెలుసుకున్నారు. అనంతరం రైతులతో మాట్లాడారు. అధికారులు ఇబ్బందులకు గురిచేస్తే ఫిర్యాదు చేయాలన్నారు. త్వరగా కొనుగోలు చెల్లింపులు అయ్యేలా చూడాలన్నారు. తుమ్మలపల్లి ప్రాథమిక పాఠశాల్లో మన ఊరు మన బడి కార్యక్రమంలో చేపడుతున్న పనులను పరిశీలించారు. పాఠశాల అభివద్ధి కమిటీ సభ్యులతో మాట్లాడారు. ప్రభుత్వం ద్వారా వచ్చే ప్రతీ పథకాన్ని ప్రజలకు అందేలా చూడాలన్నారు. ఎన్నికల సమయంతో పాటు ప్రత్యేకాధికారుల పాలనలో గ్రామాల్లో ప్రజలు ఇబ్బందులు పడకుండా అధికారులు సమయపాలన పాటించి అందుబాటులో ఉండాలన్నారు. ఆమె వెంట తహసీల్దార్ సంఘమిత్ర, ఏవో అరుణ, ఇన్‌చార్జి ఎంపీడీవో హరిసింగ్‌నాయక్, ఏపీఎం వెంకయ్య, ఐబీ ఏఈ లింగయ్య అధికారులు పాల్గొన్నారు. అదేవిధంగా చివ్వెంల మండలం వట్టిఖమ్మంపహాడ్‌లోని ఐకేపీ కేంద్రాన్ని అదనపు కలెక్టర్ ప్రియాంక పరిశీలించారు. తేమ యంత్రాన్ని, ఐరీష్ టెస్ట్ పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలని నిర్వాహకులకు సూచించారు. వర్షం వస్తే ధాన్యం బస్తాలు తడవకుండా చూసుకోవాలన్నారు. ఆమె వెంట ఏపీఎం రాంబాబు, ఎంపీవో గోపి, సీసీ వెంకన్న, ఏఈవో వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

42 వేల బస్తాల ధాన్యం ఎలా వచ్చింది?

సూర్యాపేట సిటీ, ఏప్రిల్ 12 : సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌లో 30వేల బస్తాలకు టోకెన్లు మంజూరు చేస్తే సుమారుగా 42 వేల బస్తాలకు పైగా ధాన్యం ఎలా వచ్చిందని సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి బీవీ రాహుల్ ఆరా తీశారు. శుక్రవారం మార్కెట్ యార్డుల్లో ఆయన పరిశీలించారు. 'రైతుకు టోకెన్ తంటాలు' శీర్షికన శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' మినీలో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. సిబ్బందితో కలిసి మార్కెట్ యార్డుల్లో కలియతిరిగారు. మార్కెట్ కార్యదర్శిగా బాధ్యతలు తీసుకున్న రోజు నుంచి ఏ రోజూ యార్డులలో పర్యటించని కార్యదర్శి ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రతీ యార్డును పరిశీలన చేశారు. కమీషన్‌దారులకు ఇచ్చిన టోకెన్లకు మించి ఎక్కువ ధాన్యం మార్కెట్‌కు రావడంతో కొంతమంది కమీషన్‌దారులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

బాధ్యతలు చేపట్టిన నాలుగు నెలల తర్వాత..

సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కార్యదర్శిగా బీవీ రాహుల్ బాధ్యతలు చేపట్టిన నాలుగు నెలల తర్వాత మొదటిసారి మార్కెట్ యార్డులో పర్యటించి రైతులతో ముచ్చటించారు. మార్కెట్‌లో రైతులకు అందుతున్న వసతులు, సౌకర్యాలు, ధరల గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సమస్య ఉందని, ప్రతి యార్డుల్లో చల్లటి నీటి కుండలను ఏర్పాటు చేయాలని కొంతమంది రైతులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. పచ్చి సరుకు తీసుకువస్తున్నారని సాకుతో ఖరీదుదారులు తక్కువ ధరలు ఇస్తున్నారని కొందరు రైతులు తెలిపారు.

చేనేత కార్మికులకు శుభవార్త

7

- 'చేనేతన్నకు భరోసా' పథకం అమలుకు కసరత్తు
- ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్న ప్రభుత్వం

చేనేత కార్మికుల స్వయం సమృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం 'నేతన్న భరోసా' అనే కొత్త విధానానికి రూపకల్పన చేస్తోంది. చేనేత, మరమగ్గాల కార్మికులకు దీర్ఘకాలిక లబ్ధి చేకూరేలా కొత్త పథకం ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికే అధికారులను ఆదేశించారు. ఈ మేరకు త్వరలో 'నేతన్న భరోసా' కార్యక్రమానికి కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది.

రైతులను ఇబ్బంది పెట్టొద్దు

సూర్యాపేటక్రైం, ఏప్రిల్ 12: జిల్లాలో ధాన్యం కొనుగోలు జరుగుతున్న నేపథ్యంలో రైతులతో ధాన్యం కొనుగోలు వ్యాపారులు సానుకూలంగా స్పందించాలని ఎస్పీ రాహుల్‌హెగ్డే అన్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకారం ధాన్యం కొనుగోలు చేసి రైతుల పక్షాన నిలవాలన్నారు. ఇది రైతులకు కష్టానికి, వ్యవసాయానికి ఇచ్చే గౌరవమని తెలిపారు. ధాన్యం వ్యాపారులు, మిల్లర్లు, కమీషనదారులు, ఏజెంట్ల పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మోసాలకు పాల్పడే వారిని నమ్మవద్దని, గుర్తింపు లేని వారికి ధాన్యం విక్రయించి ఆర్థికంగా నష్టపోవద్దని ఎస్పీ రైతులకు సూచించారు.

కాంగ్రెస్ హయాంలో ప్రజల కష్టాలు పెరిగాయి

- కోదాడ, హుజూర్‌నగర్‌లలో మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి



కోదాడ సమావేశంలో మాట్లాడుతున్న జగదీష్‌రెడ్డి

కోదాడ టౌన్ / హుజూర్‌నగర్, ఏప్రిల్ 12 : కాంగ్రెస్ పార్టీ హయాంలో రాష్ట్రంలోని ప్రజలకు కష్టాలు పెరిగాయని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. నల్లగొండ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డితో కలిసి శుక్రవారం కోదాడ, హుజూర్‌నగర్ పట్టణాల్లో నిర్వహించిన నియోజకవర్గ పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశాల్లో ఆయన మాట్లాడారు. ఒక పక్క ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని నాగార్జునసాగర్ ఆయకట్టులో పొలాలు ఎండుతున్నా, తాగునీటి కోసం ప్రజలు అల్లాడుతున్నా జిల్లా మంత్రులు పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ హయాంలో జిల్లాలో ఎలాంటి నీటి కష్టాలు, ఫ్లోరోసిస్ బాధలు లేవన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నీటి కష్టాలు ప్రారంభమయ్యాయని, కేసీఆర్ సీఎంగా ఉన్న సమయంలో సాగర్‌లో డెడ్‌స్టోరేజీలో నీరు ఉన్నా విడుదల చేసి పంటలు ఎండిపోకుండా కాపాడారని గుర్తు చేశారు. ప్రస్తుతం సాగర్‌లో 515 అడుగుల నీరు ఉన్నా విడుదల చేయకుండా పంటలు ఎండబెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కూడా ఉత్తరకుమారుడిలా ప్రగల్భాలు పలుకుతున్నాడని, అక్రమ కేసులు పెడితే ఏమవుతుందని ఆయన ప్రశ్నించారు. బీఆర్ఎస్ పదేళ్ల కాలంలో రాజకీయ కేసులు పెట్టలేదని, కాంగ్రెస్ నాలుగు నెలల్లో తమ కార్యకర్తలపై కేసులు పెడుతోందన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలు ఆరు గ్యారెంటీల గురించి అడిగితే కేసీఆర్‌ను బొంద పెట్టాలని అంటున్నారని, ఇచ్చిన హామీలను అమలు చేయని, కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఎన్నికల్లో బొంద పెట్టాలని కోరారు. ఎన్నికల హామీలు అమలుచేయలేని సీఎం రేవంత్‌రెడ్డి మాజీ సీఎం కేసీఆర్‌పై ఇష్టానుసారం విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. వచ్చీరాని కరెంట్‌తో పంటలు ఎండిపోయి 200 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. చేతకాని మంత్రులు పదవుల్లో ఉంటే సమస్యలు పరిష్కారం కావన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో నల్లగొండ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి విజయానికి కృషి చేయాలన్నారు. మంత్రులు మిల్లర్లను భయపెట్టి కోట్లు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఆయా సమావేశాల్లో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్య, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, బూడిద బిక్షమయ్య, బొల్లం మల్లయ్యయాదవ్, మాజీ ఎంపీపీ చింతా కవిత, ఒంటెద్దు నర్సింహారెడ్డి, నాయకులు కందిబండ సత్యనారాయణ, కస్తూరి నర్సయ్య, మామిడి రామారావు, వేద, కొప్పుల సైదిరెడ్డి, బెల్లంకొండ అమర్‌గౌడ్, ముల్కలపల్లి రాంబాబు, జక్కుల నాగేశ్వరరావు, కడియం వెంకటరెడ్డి, పార్వతి, ఉపేందర్‌యాదవ్, రంగాచారి, నగేష్, అప్పిరెడ్డి, శ్రీధర్, సురేష్, బసవయ్య, రామారావు, కవిత, కృష్ణంరాజు, పిచ్చయ్య, కృష్ణానాయక్, కెఎల్ఎన్‌రెడ్డి, మంగమ్మ, పాల్గొన్నారు.

మృత్యువులోనూ వీడని స్నేహం

- కారు ప్రమాదంలో మృతులకు మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి నివాళులు
- కుటుంబ సభ్యుల రోదనలతో మిన్నంటిన ఆసుపత్రి ఆవరణ

8



మృతుల కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న జగదీష్‌రెడ్డి

వైభవంగా ఆండాళ్ అమ్మవారి ఊంజల్ సేవ

● కొనసాగుతున్న వసంతోత్సవాలు

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 12: యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామివారి సన్నిధిలో శుక్రవారం స్వామివారికి స్వర్ణపుష్పార్చన, అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆగమశాస్త్ర రీతిలో వేడుకలు నిర్వహించిన పూజారులు వేకువజామున సుప్రభాత సేవతో స్వయంభువులను మేల్కొలిపి పంచామృతాలు, వేదమంత్ర పఠనాలతో అభిషేకం, తులసీదళాలు, కుంకుమతో అర్చించారు. ప్రాకార మండపంలో హోమం, నిత్యకల్యాణం సంప్రదాయరీతిలో కొనసాగాయి. అనుబంధ శివాలయంలో పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామికి నిత్యపూజలు, యాగశాలలో చండీహోమం శైవాగమ పద్ధతిలో చేపట్టారు. సాయంత్రం ప్రధానాలయంలో కొలువుదీరిన ఆండాళ్ అమ్మవారిని పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు ఆభరణాలతో దివ్యమనోహరంగా అలంకరించి సేవలో తీర్చిద్దారు. అమ్మవారి సేవను ఆలయతిరువీధుల్లో ఊరేగించిన అర్చకస్వాములు ప్రాకార మండపంలోని అద్దాల మండపంలోని ఊయలలో అధిష్ఠింపజేశారు. అర్చకుల వేదమంత్ర పఠనాలు, ఆస్థాన విద్వాంసుల మంగళవాయిద్యాలు, మహిళా భక్తుల మంగళ నీరాజనాల మధ్య ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా సాగింది. ఆలయఖజానాకు వివిధవిభాగాల నుంచి రూ.46,39,078 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు.



నిత్యకల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు

సీతారామ వసంతోత్సవాలు

శివాలయంలో శుక్రవారం నాలుగో రోజు శ్రీసీతారామచంద్ర స్వామివారి వసంతోత్సవాలు చేపట్టారు. నిత్యారాధనల అనంతరం మూలమంత్ర జపాలు, దశశాంతి పంచసూక్తి పారాయణాలతో పాటు అభిషేకం, ఆధ్యాత్మిక పారాయణం, స్వామిఅమ్మవార్లకు అష్టోత్తర శతనామార్చనలు జరిపారు. స్వామిఅమ్మవార్లను పట్టువస్త్రాలు, వజ్రవైఢూర్యాలతో అలంకరించి వేదపండితులు, పురోహితులు వేదమంత్రోచ్ఛరణల నడుమ మంగళవాయిద్యాలు మారుమోగుతుండగా యాగశాలకు తరలించారు. శైవాగమ రీతిలో హోమం జరిపి ప్రత్యేక పీటపై అధిష్ఠింపజేసి వసంతోత్సవాలు నిర్వహించారు. రాత్రి శివాలయంలో హనుమాన్ మూర్తులకు సహస్రనామార్చనలు, నివేదన నీరాజనం, మంత్ర పుష్పములు, వేదపండితులు, పురోహితులు, అర్చకులు తీర్థప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో అనువంశిక ధర్మకర్త భాస్కరాయణి నరసింహమూర్తి, ఈవో ఏ.భాస్కర్‌రావు, డీఈవో దోర్బల భాస్కరశర్మ, ఏఈవో దూశెట్టి కృష్ణ, పర్యవేక్షకుడు రామరావు, పూజారి దోర్బల శ్రీధరశర్మ, ఉద్యోగ సిబ్బంది పాల్గొన్నారు.

గుట్టపై సాంస్కృతిక కార్యక్రమాలు



ధార్మిక వేదికపై కాళికాదేవి అవతారవిశేషాల నృత్యప్రదర్శన

యాదగిరిగుట్టపై ఆలయ ప్రాంగణంలో శుక్రవారం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తుల రద్దీ అధికంగా ఉండే పర్వదిన, ప్రత్యేక, పండుగ, సెలవు రోజుల్లో భక్తులు తిలకించేందుకు సంగీత, సాహిత్య, ధార్మిక మహాసభలు నిర్వహించాలని ఉగాది పర్వదినం నుంచి ఈవో భాస్కర్‌రావు కొత్తవిధానాన్ని ప్రవేశపెట్టారు. తూర్పురాజగోపురం ఎదురుగా ఈశాన్య దిశలో బంగారు క్యూలైన్ పక్కన తాత్కాలిక పందిరితో నృత్యప్రదర్శన నిర్వహించారు. కళాకారుల ప్రదర్శనను భక్తులు తిలకించారు.

ఆలయ అధికారులకు మెమోలు జారీ

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 12: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఏఈవో, సూపరింటెండెంట్‌లకు మెమో జారీకి ఈవో భాస్కర్‌రావు ఆదేశించినట్లు సమాచారం. గర్భాలయ ప్రాంగణంలో సుమారు 20 నుంచి 30 మంది భక్తులు ఓ పక్కన కూర్చుని ఉండగా అప్పుడే అక్కడకు చేరుకున్న ఈవో ఆరా తీయగా వారు పెళ్లిపత్రికలు పంపిణీ చేస్తున్నట్లు ఆయన దృష్టికి వచ్చింది. తక్షణమే ఆలయ ఏఈవో, సూపరింటెండెంట్‌లను పిలిచి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. అక్కడ ఉన్న భక్తుల్లో ఒకరు ఇక్కడ కూర్చోవద్దా అని ఈవోతో వాగ్వాదం చేసినట్లు సమాచారం. అయితే ఈ సంఘటనపై అధికారులకు మెమోలు జారీ చేయాలని అడ్మినిస్ట్రేషన్ ఏఈవో గట్టు శ్రవణ్‌కుమార్‌ను ఆదేశించగా నేడో, రేపో మెమోలు అందనున్నాయి. ఇదిలా ఉంటే భక్తులను తీసుకువచ్చిన గజ్వేల్లి రఘును కూడా ఈవో మందలించినట్లు ప్రచారం సాగుతోంది.


ఆర్జాలబావి ఐకేపీ కేంద్రంలో ధాన్యం తడవకుండా రైతు ఇక్కట్లు


నల్లగొండలోని క్లాక్‌టవర్ సెంటర్‌లో వర్షంలో వెళ్తున్న వాహనాలు


వేములపల్లి వద్ద నార్కట్‌పల్లి-అద్దంకి రహదారిపై నిలిచిన నీరు


నల్లగొండలోని ఎన్జీ కళాశాల వద్ద వర్షంలో వాహనాల ప్రయాణం


నల్లగొండ పానగల్ బైపాస్ వద్ద మిర్యాలగూడ-నల్లగొండ మార్గంలో నిలిచిన నీరు

వాన.. వాన..

- అక్కడక్కడ చిరుజల్లులు, చల్లబడిన వాతావరణం
- కనగల్‌లో 21.3మి.మీ. వర్షం
- నల్లగొండలో మోస్తరు వాన

నల్లగొండ, ఏప్రిల్ 12 : వేసవితో కొద్దిరోజులుగా ఉక్కపోతతో వాతావరణం శుక్రవారం ఒక్కసారిగా మారింది. రెండు రోజులుగా ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టగా, శుక్రవారం సాయంత్రం కురిసిన జల్లులతో చల్లబడింది. నల్లగొండ జిల్లాలో సగటున 39.5డిగ్రీల వరకు ఉష్ణోగ్రత నమోదైంది. ఇక మండలాల వారీగా పరిశీలిస్తే గుర్రంపోడు, పెద్దవూర, నాంపల్లి, వేములపల్లిలో 40డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా మిగతా అన్ని మండలాల్లో 35డిగ్రీల నుంచి 39.9డిగ్రీల వరకు పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇదిలా ఉండగా శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు మబ్బులతో కూడిన వాతావరణం కనిపించింది. నల్లగొండ జిల్లా కేంద్రంలో సాయంత్రం 6.30గంటల సమయంలో ఓ మోస్తరు వర్షం కురిసింది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో అక్కడక్కడ చిరుజల్లులు కురిశాయి. వాతావరణశాఖ తెలంగాణలో మూడు, నాలుగు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పడుతున్న వానలతో కొంత మేరకు ప్రజలకు ఉపశమనం చేకూరింది. కనగల్‌లో 21.3మి.మీల వర్షపాతం నమోదైంది. చండూరు, త్రిపురారంలో 0.8మి.మీలు, నాంపల్లి, తిప్పర్తి, దేవరకొండ, గుండ్లపల్లి 0.5 మి.మీల చొప్పున చిరుజల్లులు కురిశాయి. వేములపల్లి మండలంలో సుమారు గంట పాటు వర్షం కురిసింది. నల్లగొండ సమీపంలోని ఆర్జాలబావి సమీపంలోని ఐకేపీ సెంటర్‌లో ధాన్యం రాశులు తడిసిపోయాయి. టార్పాలిన్‌లు గాలి దుమారానికి కొట్టుకుపోయాయి. ధాన్యం రాశులు తడవకుండా రైతులు ఇబ్బందులు పడ్డారు. కొన్నిరాశులు పూర్తిగా నీళ్లలో మునిగాయి. అదే విధంగా పానగల్ చౌరస్తాలో మురుగు కాల్వ పొంగిపొర్లి నీరు రహదారిపై నిలవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.



నల్లగొండలో చిరుజల్లులకు చిన్నారుల కేరింతలు, వర్షంలో కవర్‌సాయంతో వెళ్తున్న మహిళ


నల్లగొండ సమీపంలోని ఆర్జాలబావి వద్ద ఐకేపీ కేంద్రంలో నిలిచిన వర్షపు నీరు

ఉద్యాన శాఖను వేధిస్తున్న సిబ్బంది కొరత

- ఉన్న అరకొర సిబ్బందిపై అదనపు భారం
- ఎన్నికల విధులతో పాటు ప్రత్యేకాధికారులుగా నియామకం
- మూడు విధులు చూసుకోలేక ఒత్తిడిలో అధికారులు

భానుపురి, ఏప్రిల్ 12 : ఉద్యాన పంటల సాగుపై పర్యవేక్షణ కరవైంది. సిబ్బంది కొరతతో అధికారులు దృష్టి సారించలేకపోతున్నారు. రైతుల దృష్టిని ఉద్యాన పంటల వైపు మళ్లించడానికి కావాల్సిన సలహాలు, సూచనలు ఇచ్చే అధికారులు కరువయ్యారు. వరికి ప్రత్యామ్నాయంగా ఉద్యాన పంటలను ప్రోత్సహించాలని ప్రభుత్వాలు ఓ వైపు చెబుతున్నా రైతులకు సలహాలు ఇచ్చే సిబ్బంది లేకపోవడంతో రైతుల్లో అవగాహన పెంపొందడం లేదు. వెరసి జిల్లాలో అనుకున్న స్థాయిలో ఉద్యాన పంటల సాగు పెరగడం లేదు. తక్కువ సిబ్బంది

రాష్ట్రవ్యాప్తంగా 157మంది మాత్రమే ఉద్యాన శాఖ అధికారులు ఉన్నట్లు సమాచారం. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని యాదాద్రిభువనగిరి జిల్లాలో నలుగురు, సూర్యాపేట జిల్లాలో ముగ్గురు, నల్లగొండలో తొమ్మిది మంది మాత్రమే ఉద్యాన శాఖ అధికారులు ఉన్నారు. నల్లగొండలో సుమారు 75 వేల ఎకరాల్లో ఉద్యాన పంటలు, యాద్రాది భువనగిరిలో 17 వేల ఎకరాలు, సూర్యాపేట జిల్లాలో 50 వేల ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగవుతున్నాయి.

అదనపు బాధ్యతలు

ఉన్నదే ముగ్గురు అధికారులు కాగా వీరికి అదనంగా ఎన్నికల విధులు, గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారి విధులు కేటాయించారు. మూడు డ్యూటీలను చూసుకోవడానికి అధిక భారం పడుతోందని, ఆరోగ్యసమస్యలు ఉత్పన్నమవుతున్నట్లు తెలుస్తోంది. వేసవిలో రైతుల పంటలను ఎలా కాపాడుకోవాలని సలహాలు , సూచనలు ఇచ్చే అధికారులు అందుబాటులో లేకుండా పోతున్నారు. వ్యవసాయ శాఖలో కేటాయించిన రైతువేదికల వారీగా, మండలానికి ఒక అధికారిని కేటాయిస్తే ఉద్యాన పంటలు వేసి రైతులు డబుల్ ఆదాయం పొందే అవకాశం ఉంది.


కోదాడ మండలంలోని ఆయిల్‌పాం సాగును పరిశీలిస్తున్న అధికారులు

ఉన్నా వీరికి ఎన్నికల విధులతో పాటు గ్రామపంచాయతీలకు ప్రత్యేకాధికారులుగా నియమించడంతో ఉద్యాన పంటలపై పర్యవేక్షణ చేయడానికి సమయం దొరకడం లేదు. అటు పంచాయతీ విధులు, ఇటు ఉద్యాన పంటలపై కార్యక్రమాలతో ఒత్తిడడికి లోనవుతున్నారు.

సూర్యాపేట జిల్లాలో

సూర్యాపేట జిల్లాలో సుమారు 50 వేల ఎకరాల వరకు ఉద్యాన పంటలు సాగువుతుండగా, అందులో పండ్ల తోటలు 18 వేల ఎకరాలు, మిర్చి 24 వేల ఎకరాలు, కూరగాయలు 1,500 ఎకరాలు, ఆయిల్‌పాం సాగు 4వేల ఎకరాలు, ఇతర పంటలు 2 వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. జిల్లాలో ఉద్యాన శాఖలో ఐదుపోస్టులు ఉండగా ముగ్గురు మాత్రమే అధికారులు ఉన్నారు. మరో ఇద్దరు ఆన్‌డ్యూటీలో నల్లగొండలో పనిచేస్తున్నారు. 2020 సంవత్సరంలోనే ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి బడ్జెట్ కేటాయింపు లేకపోవడంతో విధులకు రావడం లేదు. వీరు రెండు మండలాలకు ఒకరి చొప్పున ఉండడంతో ఉద్యాన పంటలను పర్యవేక్షణ, డ్రిప్ ఇరిగేషన్ పనులను పర్యవేక్షించేవారు. ఔట్‌సోర్సింగ్ సిబ్బంది లేకపోవడంతో మూడేళ్ల నుంచి సూర్యాపేట జిల్లాలో ముగ్గురితోనే నెట్టుకొస్తున్నారు. సూర్యాపేట, తుంగతుర్తి, హుజూర్‌నగర్ నియోజకవర్గాలకు మాత్రమే అధికారులు ఉన్నారు. పండ్లతోటలు ఎక్కువగా ఉన్న కోదాడ నియోజకవర్గానికి అధికారి లేకపోవడం గమనార్హం. కోదాడకు అధికారి లేకపోవడంతో ఇక్కడి మండలాలను తుంగతుర్తి, సూర్యాపేట, హుజూర్‌నగర్ అధికారులకు కేటాయించారు. సూర్యాపేట అధికారికి ఈ విధులతో పాటు టెక్నికల్ బాధ్యతలను సైతం అప్పగించారు. ఒక్కొక్క ఉద్యానశాఖ అధికారి 6 నుంచి 8మండలాలకు ఒకరు ఉండడంతో ఒత్తిడికి లోనవుతున్నారు. రైతులకు సరైనా సలహాలు, సూచనలు ఇవ్వలేకపోతున్నారు. ఉద్యానపంటలపై ఆసక్తి ఉన్నా అధికారులు అందుబాటులో లేకపోవడంతో ఆ పంటల సాగులో జిల్లా వెనుకబడి ఉందని రైతులు చెబుతున్నారు.

సిబ్బంది కొరతను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

సూర్యాపేట జిల్లాలో ఉద్యాన శాఖలో సిబ్బంది కొరత ఉంది. ఉద్యాన పంటల సాగుపై వేసవి ప్రభావం పడలేదు. రైతులు పంటలను కాపాడుకుంటున్నారు. ఆయిల్‌పాం సాగుకు డ్రిప్ ఇరిగేషన్స్ పెట్టుకోవాలని ప్రోత్సహిస్తున్నాం. ఔట్‌సోర్సింగ్ సిబ్బంది లేరు. అయినప్పటికీ వీలైనంత మేరకు రైతులకు సలహాలు, సూచనలు అందజేస్తున్నాం.

- టీ నాగయ్య, ఉద్యాన శాఖ అధికారి, సూర్యాపేట

గుండెపోటుతో విద్యుత్ ఉద్యోగ సంఘ నేత మృతి


సోమాచారి (ఫైల్ ఫొటో)

మిర్యాలగూడ అర్బన్, ఏప్రిల్ 12: గుండెపోటుతో విద్యుత్ ఉద్యోగుల సంఘ నాయకుడు మృతి చెందారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణానికి చెందిన విద్యుత్ శాఖలో లైన్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్న కాతోజు సోమాచారి(56) 1104 సంఘ డివిజన్ కార్యదర్శిగా, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడిగా సేవలందిస్తున్నారు. శుక్రవారం గుండెపోటు రావడంతో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఖమ్మం నేత్రనిధికి ఆయన కళ్లను దానం చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సోమాచారి మృతికి టీసీ ఉద్యోగ సంఘాల నేతలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కార్మికుల పక్షాన ఎనలేని సేవలు చేసిన సోమాచారి మరణం తీరని లోటన్నారు. అశోక్‌నగర్‌లో సోమాచారి భౌతికకాయానికి నివాళులర్పించి, అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు కోడిరెక్క విజయకుమార్, మారం శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, వెంకటరెడ్డి, బాలు, అమర్‌సింగ్, సీతారాములు తదితరులున్నారు. సోమాచారి మరణం సంఘానికి తీరని లోటని విశ్వకర్మ సంఘ నాయకులు పేర్కొన్నారు.

గుండాలలో యువకుడు...


మధుసూదన్‌గౌడ్(ఫైల్)

గుండాల, ఏప్రిల్ 12: యాదాద్రిభువనగిరి జిల్లా గుండాల మండలం సుద్దాల గ్రామానికి చెందిన సామాజిక ఉద్యమకారుడు గూడ మధుసూదన్‌గౌడ్(27) గురువారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతి చెందారు. అర్ధరాత్రి గుండెపోటు రాగా కుటుంబ సభ్యులు స్థానికంగా ఉన్న ఆర్‌ఎంపీని తీసుకుని వెళ్లే సరికి మృతి చెందారు. గుండాల మండలాన్ని జనగాం నుంచి యాదాద్రి జిల్లాలో కలపడం కోసం సాగిన ప్రత్యేక ఉద్యమంలో మధుసూదన్‌గౌడ్ కీలక పాత్ర పోషించారు. అదేవిధంగా సుద్దాల-పల్లెపహాడ్ గ్రామాల మధ్య వంతెన నిర్మాణానికి పోరాటం చేశారు. మధుసూదన్‌గౌడ్ మృతదేహాన్ని శుక్రవారం ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, బూడిద భిక్షమయ్యగౌడ్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈరసరపు యాదగిరిగౌడ్, రాష్ట్ర నాయకులు హరిశంకర్‌గౌడ్, మాజీ ఎంపీపీ ద్యావ కృష్ణారెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ మందడి రామకృష్ణారెడ్డి, జిల్లా కోఆప్షన్ సభ్యుడు ఎండీ ఖలీల్, నాయకులు రవీందర్ తదితరులు సందర్శించి, నివాళులర్పించారు.

కడుపు నొప్పి తాళలేక వృద్ధుడి ఆత్మహత్య


లావూరి సూక్యా(ఫైల్)

త్రిపురారం, ఏప్రిల్ 12 : కడుపు నొప్పి తాళలేక వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా త్రిపురారం మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్ఐ వీరశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం త్రిపురారం గ్రామానికి చెందిన మర్ల చంద్రారెడ్డి వద్ద దామరచర్ల మండలం వాచ్యతండాకు చెందిన లావూరి సూక్యా(62) 15 ఏళ్లుగా జీతానికి పనిచేస్తున్నాడు. అతను గత ఏడాది నుంచి కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. ఎన్ని ఆసుపత్రులు తిరిగినా తగ్గలేదు. కుటుంబసభ్యులు అందరూ నిద్రిస్తుండగా ఈ నెల 11న రాత్రి సూక్యాకు తీవ్రమైన కడుపు నొప్పి వచ్చింది. నొప్పి భరించలేక ఇంట్లో ఉరేసుకున్నాడు. సూక్యాకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. భార్య కాంతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపాడు.

రూ.3.48 లక్షల నగదు స్వాధీనం

కోదాడ రూరల్/ చిట్యాల రూరల్ / చండూరు, ఏప్రిల్ 12 : ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఎన్నికల కోడ్ నేపథ్యంలో పోలీసుల తనిఖీల్లో రూ.3.48 లక్షలు పట్టుబడ్డాయి. సూర్యాపేట జిల్లా కోదాడ మండలం రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులో శుక్రవారం విజయవాడ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కారులో ఎలాంటి ఆధారాలు లేని రూ.1.50 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపారు. అదేవిధంగా నల్లగొండ జిల్లా చిట్యాల మండలంలోని వట్టిమర్తి చెక్‌పోస్టు వద్ద తనిఖీల్లో ఆధారాలు లేని రూ.68వేలను పట్టుకున్నారు. చండూరు పట్టణ శివారులో ఎలాంటి పత్రాలు లేకుండా రూ.1.30 లక్షల నగదును తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.

25 నుంచి తెలుగు రాష్ట్రాల స్థాయి ఎద్దుల పోటీలు

మఠంపల్లి, ఏప్రిల్ 12: సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండల కేంద్రంలో ఈ నెల 25వ తేదీ నుంచి 29వ తేదీ వరకు తెలుగు రాష్ట్రాల స్థాయి ఎద్దుల బల ప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నారు. మండల కేంద్రంలోని శుభవార్త దేవాలయ తిరునాళ్ల సందర్భంగా శుభోదయ యువజన సంఘం ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. సీనియర్ విభాగంలో మొదటి బహుమతి రూ.1.50లక్షలు నుంచి మొత్తం ఏడు స్థానాల్లో విజేతలకు నగదు బహుమతులు అందజేస్తామన్నారు. ఆరు పండ్ల విభాగంలో మొదటి బహుమతి రూ.50వేల నుంచి మొత్తం ఏడు స్థానాల్లో విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. నాలుగు పండ్ల విభాగంలో మొదటి బహుమతి రూ.30వేల నుంచి మొత్తం ఏడు స్థానాల్లో విజేతలకు నగదు బహుమతులతో పాటు జ్ఞాపికలను అందజేస్తామన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే రైతులకు తాగునీరు, భోజనం, వసతి సౌకర్యాలు కల్పిస్తామని, ఆసక్తి ఉన్నవారు శుభోదయ యువజన సంఘం సెల్ 9618764924 నెంబరులో సంప్రదించాలన్నారు.

శ్రీలలితాదేవి అలంకరణలో ఎల్లమ్మ తల్లి

కనగల్, ఏప్రిల్ 10 : నల్లగొండ జిల్లా కనగల్ మండలం దర్వేశిపురం స్టేజీ వద్ద గల రేణుకాఎల్లమ్మ అమ్మవారు శుక్రవారం భక్తులకు శ్రీలలితాదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అమ్మవారికి బోనాన్ని నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

తప్పిన ప్రమాదం

మునుగోడు, ఏప్రిల్ 12 : మునుగోడు మండలం కచలాపురం గ్రామంలో ఏర్పాటుచేసిన పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో లోడింగ్ చేసిన ధాన్యాన్ని స్థానికంగా ఉన్న పార్‌బాయిల్డ్ రైస్‌మిల్లులో దిగుమతి కోసం శుక్రవారం మధ్యాహ్నం లారీ బయలుదేరింది. మండల కేంద్రంలోని నార్కట్‌పల్లి వైపు ఉన్న వంతెన సమీపంలో లారీ వెనుకభాగం నుంచి ధాన్యం బస్తాలు ఒక్కసారిగా కూలీ నడిరోడ్డుపై పడ్డాయి. డ్రైవర్ అప్రమత్తతతో వెంటనే లారీని నిలిపాడు. ఎప్పుడూ రద్దీగా ఉండే రహదారిలో ఆ సమయంలో ఎవరూ లేరు. దీంతో ప్రమాదం తప్పిందని స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

ఆరుకు చేరిన ఆటో ప్రమాద మృతులు

చికిత్స పొందుతూ ఆటోడ్రైవర్ మహేష్ మృతి


మహేష్(ఫైల్)

అర్వపల్లి / సూర్యాపేట రూరల్, ఏప్రిల్ 12 : సూర్యాపేట జిల్లా కేంద్ర సమీపంలో ఈ నెల 4వ తేదీన ఆగి ఉన్న లారీని ఆటో వెనక నుంచి ఢీకొన్న ఘటనలో మృతుల సంఖ్య ఆరుకు చేరింది. ఘటనా స్థలంలో ముగ్గురు మృతి చెందగా, రోజుల వ్యవధిలో చికిత్స పొందుతూ ఇద్దరు చిన్నారులు మృతి చెందారు. అదేవిధంగా హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆటో డ్రైవర్ కప్పసాటి మహేష్(30) చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. దీంతో మృతుల సంఖ్య ఆరుకు చేరింది. కాగా మహేష్‌కు ఆరు నెలల కిందటే వివాహమైంది.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

మోతె, ఏప్రిల్ 12: బైక్‌ను కారు ఢీకొన్న ఘటనలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా మోతె మండలం మామిళ్లగూడెంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని రాఘవాపురం గ్రామానికి చెందిన వీరబోయిన బక్కయ్య వీరబోయిన మల్లయ్య వీరబోయిన మనోజ్‌లు గ్రామం నుంచి బైక్‌పై పాలేరు సంతకు వెళ్తున్నారు. మామిళ్లగూడెం గ్రామశివారులో రైతువేదిక వద్ద నుంచి ఫ్లైఓవర్ పైకి వెళ్తుండగా హైదరాబాద్ నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న కారు అతివేగంతో వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో బైక్ పైనుంచి పడి ముగ్గురికి గాయాలయ్యాయి. వీరిని 108వాహనంలో సూర్యాపేట ఆసుపత్రికి తరలించారు.ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.

మోత్కూరు మండలంలో


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అజీద్

మోత్కూరు : యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మండలం కొండగడప, పాటిమట్ల గ్రామాల మధ్య శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి గాయపడ్డాడు. పాటిమట్ల గ్రామంలోని కాశవాడకు చెందిన షేక్ అజీద్ స్కూటర్‌పై వెళ్తుండగా ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. గాయపడిన అజీద్‌ను 108వాహనంలో నార్కట్‌పల్లిలోని కామినేని ఆస్పత్రికి తరలించినట్టు ఈఎంటీ రంజిత్, పైలెట్ శంకర్ తెలిపారు. కారు చౌటుప్పల్ మండలం ఏపీలింగోటం గ్రామానికి చెందినదిగా సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ధాన్యం కొనుగోలులో జాప్యంపై ఆగ్రహం

- జాయింట్ కలెక్టర్‌కు రైతుల ఫిర్యాదు
- నల్లగొండ జిల్లా కనగల్ మండలంలో ఘటన


కనగల్ మండలంలోని జీ.ఎడవల్లి గ్రామంలో ధాన్యం ట్రాక్టర్లతో రాస్తారోకో చేస్తున్న రైతులు

కనగల్, ఏప్రిల్ 12: ధాన్యం కొనుగోలులో జాప్యాన్ని నిరసిస్తూ నల్లగొండ జిల్లా కనగల్ మండలంలోని జీ.ఎడవల్లి రైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు. శుక్రవారం ధాన్యం ట్రాక్టర్లతో రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన రైతు కానుగు భూపతి మాట్లాడుతూ ఐకేపీ కేంద్రం నిర్వాహకులు వడ్ల కొనుగోలులో సీరియల్‌ను పాటించటం లేదని, ఓ పార్టీ నాయకుల సూచన మేరకు పని చేస్తూ తమ ధాన్యాన్ని కాంటాలు వేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. 15 రోజుల క్రితం కేంద్రానికి ధాన్యం తీసుకురాగా తమకంటే వెనుక తీసుకువచ్చిన రైతుల ధాన్యం రాశులను కాంటా వేస్తున్నారన్నారు. కేంద్రంలో రోజుల తరబడి కాంటాల కోసం ఎదురుచూసి చివరకు ఇతర కేంద్రాలకు వడ్లను తీసుకెళుతున్నట్టు వాపోయారు. ఐకేపీ కేంద్రం నిర్వాహకుల తీరుపై జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. రైతుల ఆందోళనతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వారితో మాట్లాడి రాస్తారోకోను విరమింపజేశారు. రైతులు చేస్తున్న ఆరోపణలపై మండల మహిళా సమాఖ్య కార్యాలయ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ హరిని వివరణ కోరగా క్రితంసారి సెంటర్‌ను నడిపిన పీఏసీఎస్ అధికారులు సీరియల్ బుక్‌ను సకాలంలో అందించకపోవటంతో కొద్దిపాటి ఆలస్యమైందన్నారు. శుక్రవారం రాత్రి రాస్తారోకో చేసిన సదరు 9మంది రైతుల వడ్లకు కాంటాకు సీరియల్ ఉందని, ఈలోగానే వారు సెంటర్ నుంచి వడ్లను ఇతర సెంటర్లకు తీసుకువెళ్లారని తెలిపారు. ఐకేపీ నిర్వాహకులపై ఎలాంటి రాజకీయ ఒత్తిడి లేదన్నారు.

చేనేత కార్మికులకు శుభవార్త!

- నేత కార్మికులకు అండగా 'నేతన్న భరోసా' పథకం
- కొత్త విధానానికి సర్కారు కసరత్తు
- త్వరలో ప్రారంభానికి కాంగ్రెస్ ప్రభుత్వం సన్నాహకం



భూదాన్‌పోచంపల్లి, ఏప్రిల్ 12 : ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న నేత కార్మికులకు అండగా నిలిచేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం 'నేతన్న భరోసా' కార్యక్రమాన్ని త్వరలో అమలు చేయనుంది. చేనేతల దీర్ఘకాలిక ప్రయోజనాలే లక్ష్యంగా ప్రభుత్వం ఆర్డర్లన్నీ 'టెస్కో' ద్వారానే కొనసాగించాలని నిర్ణయించింది. చేనేత కార్మికుల స్వయం సమృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం 'నేతన్న భరోసా' అనే కొత్త విధానానికి రూపకల్పన చేస్తోంది. చేనేత, మరమగ్గాల కార్మికులకు దీర్ఘకాలిక లబ్ధి చేకూరేలా కొత్త పథకం ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికే అధికారులను ఆదేశించారు. ఈ మేరకు త్వరలో 'నేతన్న భరోసా' కార్యక్రమానికి కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది. ఈ పథకంతో చేనేత, మరమగ్గాల కార్మికుల సంక్షేమానికి తాత్కాలిక ప్రయోజనం కన్నా దీర్ఘకాలిక లబ్ధి చేకూరేలా ఈ విధానాన్ని తీసుకు రానున్నారు. ఏడాది మొత్తం పని ఉండేలా రూపకల్పన చేస్తున్నట్లు సమాచారం. ఇందులో భాగంగా రాష్ట్రంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ (ఐఐహెచ్‌టీ) ఏర్పాటు, హ్యాండ్లూమ్ పార్కు పునరుద్ధరణ, కొత్త పవర్‌లూమ్ క్లస్టర్ల అభివృద్ధి, మైక్రో హ్యాండ్లూమ్ క్లస్టర్ల ఏర్పాటు, నేషనల్ సెంటర్ ఫర్ డిజైన్ల ఏర్పాటు, స్టేట్ టెక్నికల్ టెక్స్‌టైల్స్ పాలసీ తెచ్చేందుకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించిందని ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. నేతన్నల కోసం కేంద్ర ప్రభుత్వం నుంచి వివిధ పథకాలను అనుసంధానం చేయడంతోపాటు రావాల్సిన బకాయిలను తెచ్చుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆ అధికారి తెలిపారు.

చేనేత వస్త్రాల కొనుగోలు ప్రక్రియ 'టెస్కో' ద్వారానే..

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని చేనేత సహకార సంఘాలకు పెండింగ్‌లో ఉన్న రూ.8.81 కోట్ల బకాయిలను విడుదల చేసిన ప్రభుత్వం అన్ని ప్రభుత్వ శాఖలు 'టెస్కో' ద్వారానే వస్త్రాలను కొనుగోలు చేయాలని నిర్ణయించారు. మ్యాక్స్ సహకార సంఘాలను ప్రోత్సహించిన బీఆర్‌ఎస్ సర్కారు విధానాలతో అసలైన కార్మికులకు లబ్ధి చేకూరలేదని, వ్యాపారులు, దళారుల జోక్యం మితిమీరిందనే ఆరోపణలు అప్పట్లో వెల్లువెత్తాయి. రాష్ట్రంలో 393 చేనేత సహకార సంఘాలు ఉంటే, కేవలం 105 చేనేత సహకార సంఘాలకు మాత్రమే పనికల్పించినట్లు ప్రస్తుత ప్రభుత్వ విచారణలో వెల్లడైంది. ఇందుకు భిన్నంగా అన్ని చేనేత సహకార సంఘాలకు పని కల్పించాలని నిర్ణయించారు. ఇప్పటి వరకు రూ.53 కోట్ల వస్త్రాలు కొనుగోలు చేసి, గతంలో చేనేత సహకార సంఘాలకు పెండింగ్‌లో ఉన్న రూ. 8.81కోట్ల బకాయిలను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేసింది. మార్చి 11వ తేదీ జీవో 1ని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అమలుపరుస్తూ టెస్కో ద్వారానే అన్ని ప్రభుత్వ శాఖలు వస్త్రాలు కొనుగోలు చేయాలని ఆదేశించింది. దీంతో టెస్కోలో లభ్యంకాని వస్త్రాలకు నాన్ ఎవైలబులిటీ సర్టిఫికేట్ ఇస్తే తప్ప, ప్రైవేటు ఏజెన్సీల నుంచి కొనుగోలు చేసే అవకాశం ఉండదు. ఈ మేరకు ఇప్పటికే వివిధ ప్రభుత్వ శాఖలు వస్త్రాల సరఫరా కోసం టెస్కోకు రూ.255.27 కోట్ల విలువైన ఆర్డర్లు ఇచ్చినట్లు సమాచారం.

చేనేత సంఘాలకు నూతన జవసత్వాలు

ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ఉన్న చేనేత సహకార సంఘాలకు 'నేతన్న భరోసా' పథకంతో మళ్లీ నూతన జవసత్వాలు కలుగనున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని ప్రభుత్వ శాఖలు 'టెస్కో' ద్వారానే వస్త్రాల కొనుగోళ్లు చేయాలని భావిస్తుండటంతో చేనేత సహకార సంఘాలకు పూర్వవైభవం సంతరించే అవకాశం ఉంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 72 చేనేత సహకార సంఘాలున్నాయి. వీటిపై 32 వేలకు పైగా కుటుంబాలు ఆధారపడి ఉన్నాయి. చేనేత గిట్టుబాటు కాక పలు రకాల పనులు చేస్తూ పొట్టపోసుకుంటున్న కుటుంబాలు వేల సంఖ్యలో ఉన్నాయి. గుమస్తాలుగా, రోజు వారి కూలీలుగా, సెక్యూరిటీలుగా, సైకిళ్లపై తిరిగి వస్త్రాలు విక్రయిస్తూ భారంగా జీవనం సాగిస్తున్నారు. భీవండి, షోలాపూర్, సూరత్, అహ్మదాబాద్‌లకు వలస వెళ్లి అక్కడి మిల్లుల్లో కూలీలుగా పనిచేస్తున్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయనున్న చేనేత పథకాల వల్ల తమకు లబ్ధి కలిగే అవకాశం ఉందని చేనేత కార్మికులు ఆవాభావం వ్యక్తం చేస్తున్నారు. ఏదైమైనా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించనున్న 'నేతన్న భరోసా' వల్ల చేనేత కార్మికుల దశాబ్దాల కల సాకారం కానుందని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మృత్యువులోనూ వీడని స్నేహం



ఆస్పత్రిలో మృతుల కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న బడుగుల, ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి

» జిల్లా కేంద్రంలో విషాదం
» రంజాన్ పర్వదినాన కుమారుడి దుర్మరణం





సూర్యాపేటలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన (1) వెన్న నిఖిల్‌రెడ్డి, (2) షేక్ నవీద్, (3)గుండగాని రాకేష్(ఫైల్)

సూర్యాపేటక్రైం, ఏప్రిల్ 12: జిల్లా కేంద్రంలో గురువారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు స్నేహితులు మృతి చెందడంతో ఆ కుటుంబాల్లో తీరని విషాదం నెలకొంది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. సూర్యాపేట పట్టణం హైమానగర్‌కు చెందిన స్నేహితులు వెన్న నిఖిల్‌రెడ్డి(23), నవీద్(28), గుండగాని రాకేష్ (22), ఆదిత్య ఉన్నత విద్య పూర్తిచేసి జీవితంలో స్థిరపడే ప్రయత్నాల్లో ఉన్నారు. రంజాన్ మాసం ఉపవాస దీక్షలు ముగియటంతో నవీద్‌తో పాటు మిగిలిన స్నేహితులు రాత్రి సమయంలో భోజనానికి కారులో బయలుదేరారు.

కిలోమీటరున్నర దూరం వెళ్లగానే..

కారు కిలోమీటరున్నర దూరం ప్రయాణించి ఖమ్మం క్రాస్ రోడ్డు ఫ్లైఓవర్ సమీపంలో ముందు వెళుతున్న డీసీఎంను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు స్నేహితులు అక్కడికక్కడే మృతి చెందగా, గాయపడిన ఆదిత్యను చికిత్స కోసం హైదరాబాద్ తరలించారు. ముందు వెళుతున్న డీసీఎం డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో వెనుక ఉన్న కారు ఢీకొని ముగ్గురు మృతిచెందినట్లు నిఖిల్‌రెడ్డి తండ్రి సతీష్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలకు సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో శుక్రవారం పోస్టుమార్టం పూర్తయిన తర్వాత కుటుంబ సభ్యులకు అప్పగించారు. ముగ్గురి మృతదేహాలను వారి మత సంప్రదాయాల ప్రకారం కుటుంబ సభ్యులు అంత్యక్రియలను పూర్తి చేశారు. మృతుల అంత్యక్రియల్లో విద్యార్థులు, బంధుమిత్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ముగ్గురి కుటుంబాల్లో విషాదం

చదవు పూర్తిచేసుకుని కుటుంబాలకు చేదోడుగా ఉంటారనుకున్న యువకులు రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడటం ఆ కుటుంబాల్లో తీరని విషాదం నెలకొంది. సూర్యాపేటలో జ్యూయలరీ వ్యాపారం చేసే వెన్న సతీష్‌రెడ్డి-మాధవి దంపతుల రెండో కుమారుడు నిఖిల్‌రెడ్డి డిప్లొమా విద్యను పూర్తిచేసి వ్యాపారంలో తండ్రి చేదోడువాదోడుగా ఉంటున్నాడు. ఉన్నత చదువుల నిమిత్తం విదేశాలకు వెళ్లేందుకు ప్రయత్నాల్లో ఉన్న నిఖిల్‌రెడ్డి రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆ కుటుంబం కన్నీరుమున్నీరవుతోంది.

● గుండగాని రాకేష్‌ది పేద కుటుంబం కాగా, స్వస్థలం సూర్యాపేటలోని జాకీర్‌హుస్సేన్‌నగర్. తండ్రి సోమనర్సయ్య లారీ డ్రైవర్, తల్లి లక్ష్మి గృహిణి. రాకేష్‌తో పాటు ఇద్దరు కుమార్తెలు కాగా, కుమారుడిని బీటెక్ చదివించారు. విదేశాల్లో ఉన్నత విద్య చదివేందుకు వెళ్లే ప్రయత్నాల్లో భాగంగా వారం రోజులో ఇంటర్వ్యూకు హాజరుకావాల్సి ఉంది. చేతికి అందివచ్చి తమ కష్టాలను గట్టెక్కిస్తాడనుకున్న తల్లిదండ్రులు, కుమారుడి మృతితో తమకు దిక్కెవరు అంటూ తల్లడిల్లుతున్నారు.

● సూర్యాపేటలోని పొట్టిశ్రీరాములు సెంటర్ ప్రాంతానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి షేక్ జమీన్‌అలీ-షామీన్ దంపతుల ఏకైక కుమారుడైన నవీద్ హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు చేశాడు. ప్రస్తుతం మొబైల్ ఫోన్ల సేల్స్‌మన్‌గా పనిచేస్తూ దుబాయ్‌కు వెళ్లే ప్రయత్నాల్లో ఉన్నాడు. రంజాన్ పండుగ రోజే కుమారుడు నవీద్ మృతిచెందడంతో తల్లిదండ్రులు తట్టుకోలేకపోతున్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

సూర్యాపేట మార్చురీలో భద్రపర్చిన ముగ్గురి మృతదేహాలను రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి పరిశీలించారు. మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి వెంట మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్, బీఆర్ఎస్ నల్లగొండ పార్లమెంట్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, ఒంటెద్దు నర్సింహ్మారెడ్డి, గండూరి ప్రకాష్, నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, నెమ్మాది భిక్షం, జీడి భిక్షం, ఉప్పల ఆనంద్, రామసాని శ్రీనివాస్‌నాయుడు, కక్కిరేణి నాగయ్యగౌడ్, రాపర్తి శ్రీనివాస్, సయ్యద్, సాల్మా, వల్దాస్ జానీ, పల్స వెంకన్న ఉన్నారు.

ఉత్సవ విగ్రహాలకు జలాభిషేకం



పొట్లపహాడ్ గ్రామంలో జల బిందెలతో దేవాలయానికి వస్తున్న మహిళలు

పెన్‌పహాడ్, ఏప్రిల్ 12: మండలంలోని పొట్లపహాడ్ గ్రామంలో శ్రీకంఠమహేశ్వరస్వామి, సూరమాంబదేవి, రేణుకఎల్లమ్మ, పోతురాజు విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు శుక్రవారం రెండో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా మహిళలు జలబిందెలు, పాలబిందెలతో ఊరేగింపుగా దేవాలయానికి వచ్చి ఉత్సవ విగ్రహాలు, గరుడ స్తంభానికి అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో మేకపోతుల నవీన్, గూడెపురి సైదులు, మేకపోతుల సైదులు పాల్గొన్నారు.

● పెన్‌పహాడ్ గ్రామ పంచాయతీ పరిధిలోని సీతారాంపురం కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారామాంజనేయస్వామి దేవాలయంలో విగ్రహాల ప్రతిష్ఠోత్సవాలు శుక్రవారం రెండో రోజుకు చేరుకున్నాయి. ముందుగా ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శివకుమార్ ఆలయ అర్చకుడు శివరామకృష్ణశర్మ,రవీందర్, జయరాం పాల్గొన్నారు.

రాములోరి కల్యాణానికి గోటి తలంబ్రాల బియ్యం

కోదాడటౌన్, ఏప్రిల్ 12: స్థానిక కోదండ రామాయలంలో ఈ నెల 17న శ్రీరామ నవమి సందర్భంగా నిర్వహించే సీతారాముల కల్యాణానికి వడ్లు వలిచి తలంబ్రాలు బియ్యం సమకూర్చే కార్యక్రమం శుక్రవారం స్థానిక రామాలయంలో మహిళలు చేపట్టారు. మహిళలు ఎంతో నిష్ఠతో ఓపికతో వడ్లు వలుస్తున్నారు.

సంప్రదాయబద్ధంగా లక్ష్మీనృసింహుని కల్యాణం

మఠంపల్లి, ఏప్రిల్ 12: మట్టపల్లి పుణ్యక్షేత్రంలో శుక్రవారం లక్ష్మీనృసింహుని నిత్య కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో విష్వక్సేన ఆరాధన, పుణ్యాహావాచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాసన అనంతరం స్వామివారికి మాంగల్యధారణ, తలంబ్రాలతో నిత్య కల్యాణాన్ని అత్యంత వైభవంగా జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు చెన్నూరి విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈవో నవీన్, అర్చకులు శ్రీనివాసాచార్యుల ఫణిభూషణమంగాచార్యులు పాల్గొన్నారు.

ప్రజల దాహార్తి తీర్చడానికే చలివేంద్రాలు

అర్వపల్లి, ఏప్రిల్ 12: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి తమ వంతుగా చలివేంద్రాలు ఏర్పాటు చేశామని రేఖ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ డాక్టర్ బోయినపల్లి రేఖ అన్నారు. శుక్రవారం మండంలోని అడివెంల క్రాస్ రోడ్డు వద్ద చలివేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. అనంతరం 200మజ్జిగ ప్యాకెట్లను ప్రయాణికులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పద్మ పాల్గొన్నారు.

పూలే ఆశయసాధనకు కృషి చేయాలి

సూర్యాపేటఅర్బన్, ఏప్రిల్ 12: మహాత్మ జ్యోతిరావుపూలే ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ సగర అన్నారు. హైదరాబాద్‌లోని కర్మాన్‌గాట్ ఆంజనేయస్వామి దేవాలయం నుంచి ఈ నెల ఏడో తేదీన బయలుదేరిన మహాపాదయాత్ర శుక్రవారం ఆరో రోజు జిల్లా కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరామనమిని పురస్కరించుకుని భద్రాచలంలోని సీతారామస్వాముల కల్యాణానికి పట్టువస్త్రాలు, తలంబ్రాలు, వడిబియ్యాన్ని అందజేస్తామన్నారు. అనంతరం సూర్యాపేటలోని జ్యోతిరావుపూలే విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఆర్‌బీ ఆంజనేయులు, పెద్దబుద్దుల సతీష్, చీర్ల విష్ణు, మర్క సురేష్, మహేందర్ పాల్గొన్నారు.

10లీటర్ల సారా స్వాధీనం

మద్దిరాల, ఏప్రిల్ 12: మండలంలో సారాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ మధునాయుడు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రాజ్‌నాయక్ తండాకు చెందిన బానోతు హుస్సేన్ ఇంట్లో శుక్రవారం తనిఖీ చేసి 10లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

12క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

మద్దిరాల, ఏప్రిల్ 12: అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని పట్టుకుని ఓ వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ మధునాయుడు తెలిపిన వివరాల ప్రకారం.. చందుపట్ల గ్రామానికి చెందిన పులుసు లింగయ్య ఇంట్లో పోలీసులు తనిఖీ చేసి 20క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకుని కేసు నమోదు చేశారు.

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిని గెలిపించాలి: ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేలు

తుంగతుర్తి, ఏప్రిల్ 12: భువనగిరి పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి తుంగతుర్తి నియోజకవర్గం నుంచి అత్యధిక మెజార్టీ వచ్చేలా కార్యకర్తలు కృషి చేయాలని ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్ నిర్వహించిన భువనగిరి పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో తనను 50వేలకు పైగా మెజార్టీతో గెలిపించిన ఈ ప్రాంత ప్రజలకు జీవితాంతం రుణపడి ఉంటానని, నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానని అన్నారు. నియోజకవర్గ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని తిరుమలగిరిలో ఈనెల 14న నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి భువనగిరి పార్లమెంట్ కోఆర్డినేటర్ ఇన్‌చార్జి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి హాజరై పార్టీ కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తారన్నారు. నియోజకవర్గంలో రూ.13కోట్లతో 'ఉపాధి' పనులు చేశామన్నారు. 150 గ్రామ పంచాయతీల్లో సీసీ రోడ్లు నిర్మించామన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ తుంగతుర్తి మండల అధ్యక్షుడు దొంగరి గోవర్ధన్, తిరుమలగిరి మునిసిపల్ చైర్మన్, అనసూయ, మోత్కూరు మునిసిపల్ చైర్మన్ కవితలక్ష్మీనరసింహారెడ్డి, జిల్లా నాయకులు రేతినేని శ్రీనివాసరావు, ఓరుగంటి సత్యనారాయణ, పెండెం రాంమూర్తి, సంకినేని గోవర్ధన్‌రావు, మాధవరావు, మద్దిరాల మండల అధ్యక్షుడు ముక్కాల అవిలమల్లుయాదవ్, తుంగతుర్తి పట్టణ అధ్యక్షుడు రాంబాబు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గరిడేపల్లి మండలంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ

నేటి నుంచి మరమ్మతులు



గరిడేపల్లి శివారులో మిషన్ భగీరథ పైప్ లైన్ లీకై వృథాగా వెళుతున్న నీరు

గరిడేపల్లి, పెన్‌పహాడ్, కోదాడ టౌన్, ఏప్రిల్ 12: మండల కేంద్రంలోని సూర్యాపేట రోడ్డులో ఉన్న కోళ్ల ఫారం సమీపంలో రైతు బండ వెంకటరెడ్డి పొలంలో మిషన్ భగీరథ పైప్ లైన్ లీకై నీరు వృథాగా పోతుంది. అవంతిపురం నుంచి ఇమాంపేట ప్లాంట్‌కు మిషన్ భగీరథ తాగు నీటిని సరఫరా చేసే పంపింగ్ మెయిన్ ఎంఎస్1200 పైప్ లైన్ ఈ ప్రాంతంలో లీకవుతోందనిఅధికారులను తెలిపినా పట్టించుకోలేదని స్థానికులు తెలిపారు. వేసవిలో తాగునీటి ఎద్దడి ఏర్పడగా, నీరు వృథాడి పోతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

168గ్రామాలకు మూడు రోజుల పాటు నీటి సరఫరా నిలిపివేత

గరిడేపల్లి సమీపంలో భగీరథ పైప్ లైన్‌కు మరమ్మతు చేయడానికి 95 ఎంఎల్‌డీ ఇమాంపేట నీటి శుద్ధి కేంద్రాన్ని శనివారం సాయంత్రం నుంచి షట్‌డౌన్ చేస్తున్నట్లు గ్రిడ్ ఏఈ జనార్దన్‌రెడ్డి, పెన్‌పహాడ్ ఎంపీడీవో వెంకటేశ్వర్‌రావు, కోదాడ మునిసిపల్ కమిషనర్ ఎ.రమాదేవి తెలిపారు. ఈ కారణంగా సూర్యాపేట, కోదాడ మునిసిపాలిటీల పరిధితో పాటు చిలుకూరు, కోదాడ, అనంతగిరి, మునగాల, నడిగూడెం, పెన్‌పహాడ్, మండలాల పరిధిలోని సుమారు 168 గ్రామాలు, సూర్యాపేట మండలంలోని 15గ్రామాలకు రెండు రోజుల పాటు నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని అన్నారు. ఈ నెల 15వ తేదీ సాయంత్రం నుంచి తాగునీటి సరఫరాను పునరుద్ధరిస్తారని వారు తెలిపారు. కోదాడ పట్టణంలో అవసరమైన ప్రాంతాల్లో ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తామని మునిసిపల్ కమిషనర్ రమాదేవి తెలిపారు. అవసరమైనవారు హెల్ప్ డెస్క్ సహాయకులు, సెల్ నెం. వై.రాజు 8374454641, టి.రంగాచారి 7013318565, హనుమంతరావు 966164973ను సంప్రదించాలన్నారు.

చిరుధాన్యాలను ఆహారంగా తీసుకుంటే ఆరోగ్యం

గరిడేపల్లి, ఏప్రిల్ 12: చిరుధాన్యాలను ఆహారంగా తీసుకుంటే ఆరోగ్యంగా ఉండ వచ్చని గడ్డిపల్లి స్టేట్ బ్యాంకు మేనేజర్ సుకుమార్ అన్నారు. చిరుధాన్యాలతో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై ఎస్టీ మహిళలకు మండలంలోని గడ్డిపల్లి కేవీకేలో మూడు రోజుల శిక్షణ ముగింపు కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చిరుధాన్యాలను మార్కెటింగ్ చేయడం ద్వారా స్వయం ఉపాధి పొందవచ్చని, మార్కెటింగ్ చేసేవారికి బ్యాంకు రుణాన్ని మంజూరు చేస్తామన్నారు. అనంతరం శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కేవీకే ఇన్‌చార్జి ప్రోగ్రాం కోఆర్డినేటర్ డి.నరేష్, గృహనిర్మాణ శాస్త్రవేత్త ఎస్.సుగంధి, ఏ.కిరణ్ వివిధ గ్రామాలకు చెందిన మహిళలు పాల్గొన్నారు.

'ఉపాధి' కూలీలు జాగ్రత్తలు తీసుకోవాలి

సూర్యాపేట రూరల్, ఏప్రిల్ 12: వడదెబ్బ తగలకుండా 'ఉపాధి' కూలీలు జాగ్రత్తలు తీసుకోవాలని కేసారం ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ వైద్యాధికారి సుష్మ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కేసారం ప్రభుత్వ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో 'ఉపాధి' కూలీలకు ఔషధాలు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేసి మాట్లాడారు. . కార్యక్రమంలో ఏఎన్ఎం ఉపేంద్ర, ఆశా కార్యకర్తలు రాజేశ్వరి, మేరమ్మ, వృద్ధులు, గర్భిణులు పాల్గొన్నారు.

పిచ్చి కుక్కదాడిలో 12మందికి తీవ్రగాయలు

మఠంపల్లి, ఏప్రిల్ 12: పిచ్చి కుక్క దాడిలో 12మందికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వివరాల ప్రకారం.. మఠంపల్లిలోని పీర్లచావడి, ముదిరాజ్, యాదవ్ బజారులో శుక్రవారం ఓ పిచ్చి కుక్క పలువురిని కరిచింది. దీంతో జాల అంకమ్మ, వల్లపుదాసు శ్రీను, కస్తాల శంభయ్య, కురకుల సంజయ్, వెంకటమ్మ, లక్ష్మమ్మ, లక్ష్మితో పాటు మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స కోసం స్థానిక పీహెచ్‌సీకి వెళ్లగా డాక్టర్లు అందుబాటులేరని, ఉన్న వైద్య సిబ్బంది మందులులేవన్నారని, దీంతో హుజూర్‌నగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నట్లు బాధితులు తెలిపారు. గ్రామంలో కుక్కల బెడదను నివారించాలని అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడంలేదని స్థానికులు తెలిపారు.

సీపీఎం అభ్యర్థిని గెలిపించాలి: లక్ష్మి

అర్వపల్లి, ఏప్రిల్ 12: భువనగిరి పార్లమెంట్ స్థానంలో సీపీఎం నుంచి పోటీ చేస్తున్న జహంగీర్‌ను గెలిపించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి కోరారు. సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని జాజిరెడ్డిగూడెం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఎం నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో చెరుకు ఏకలక్ష్మి, వడ్డె శ్రీనివాస్, రజిత, సరోజ, శిగ వెంకన్న, విజయ్‌కుమార్, శ్రీను, శ్రీకాంత్ పాల్గొన్నారు.

శునకానికి సంప్రదాయంగా అంత్యక్రియలు



శునకం అంత్యక్రియలో పాల్గొన్న కాలనీవాసులు

కోదాడ టౌన్, ఏప్రిల్ 12: పట్టణంలోని నయానగర్‌కు చెందిన మల్లారెడ్డికి చెందిన పెంపుడు కుక్క అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందింది. శునకం మృతిని తట్టుకోలేక ఇంటి యజమానులు తల్లడిల్లిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది. మల్లారెడ్డి ఇంటికి పెద్ద సంఖ్యలో ప్రజలు వచ్చి ఆయనను ఓదార్చారు. కుక్క కళేబరానికి సంప్రదాయ రీతిలో బ్యాండ్ మేళాలతో ఊరేగింపు నిర్వహించి గ్రామ శివారులో అంత్యక్రియలు నిర్వహించారు. శునకానికి చిన్నదినం, పెద్దదినం కార్యక్రమాలు చేస్తున్నట్లు శునకం యజమాని మల్లారెడ్డి తెలిపారు.

'రైతు వ్యతిరేక ప్రభుత్వాన్ని గద్దె దించాలి'

మఠంపల్లి, ఏప్రిల్ 12: రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వాన్ని గద్దెదించాలని రైతు సంఘం జిల్లా నాయకులు భూక్య పాండునాయక్, శాగంరెడ్డి జగన్మోహన్‌రెడ్డిలు అన్నారు. శుక్రవారం సీపీఎంకార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. వ్యవసాయ మోటర్లకు మీటర్ల విధానాన్ని రద్దు చేయాలని, స్వామినాథన్ సిఫార్సును అమలు చేయాలన్నారు. పంటలకు కనీస మద్దతు ధర కల్పించాలని, 55ఏళ్లు నిండిన రైతులకు రూ.10 వేల ఫించన్లు అందించి,రుణ విమోచన అమలు చేయాలని కోరారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున ఉపాధిహామీ కూలీలకుపని ప్రదేశంలో టెంట్లు, తాగునీరు, ప్రథమ చికిత్స బాక్సు ఇతర సౌకర్యాలు కల్పించాలని కోరారు. కిలోమీటర్ల దూరం పనికి వెళ్లి వస్తున్న కూలీలకు ఆరోగ్య రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మాలోతుబాలు నాయక్, వినోద్, వెంకటరెడ్డి, రన్‌మియా, శంభయ్య, కేశ్యానాయక్, మట్టపల్లి, నాగేశ్వరావు తదితరులు ఉన్నారు.

గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు నారపరెడ్డి మృతి



నారపరెడ్డి (ఫైల్ ఫొటో)

హుజూర్‌నగర్, ఏప్రిల్ 12: మండలంలోని వేపలసింగారం గ్రామానికి చెందిన ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు, కాంగ్రెస్ నాయకుడు మాజీ సర్పంచ్ గుజ్జుల నారపరెడ్డి (81)మృతిచెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన శుక్రవారం ఉదయం తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. నారపరెడ్డికి భార్య, కుమారుడు ఉన్నారు. నాలుగు సంవత్సరాల పాటు ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా, 24సంవత్సరాల పాటు వేపలసింగారం సర్పంచ్‌గా, ఉమ్మడి రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం కార్యదర్శిగా పనిచేశారు. నారపరెడ్డి మృతికి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి సంతాపం తెలిపారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామన్నారు. నారపరెడ్డి మృతదేహంపై మాజీ ఎమ్మెల్యే చందర్‌రావు, నల్లగొండ జిల్లా పరిషత్ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి, ఎంపీపీ గూడెపు శ్రీనివాసు, ఐఎన్‌టీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్న, అరుణ్‌కుమార్, చక్కెర వీరారెడ్డి, కుందూరు శ్రీనివాస్‌రెడ్డి, నిజాముద్దీన్, తన్నీరు మల్లికార్జున్‌రావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బీజేపీ అభ్యర్థి సైదిరెడ్డిని ప్రజలు ఆదరించాలి'

కోదాడ టౌన్, ఏప్రిల్ 12: నల్గొండ పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ కోదాడ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ కనగాల నారాయణరావు, నూనె సులోచన అన్నారు. శుక్రవారం కోదాడలో బీజేపీ కార్యాలయం ఎదుట కొబ్బరికాయలు కొట్టి, జెండా ఊపి ఆ పార్టీ ప్రచార రథాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో బండారు కవిత, అమరేందర్‌రెడ్డి, బొలిశెట్టి కృష్ణయ్య, వంగవీటి శ్రీనివాసరావు, చిట్టిబాబు, నాగేంద్రచారి, కృష్ణప్రసాద్, దున్న సతీష్‌రెడ్డి, దేవరశెట్టి సత్యనారాయణ, వెంకటేశ్వర్‌రెడ్డి, సీహెచ్ సతీష్, శ్రీనివాస్, శోభారాణి, పాపయ్య, సైదులు పాల్గొన్నారు.

జార్జిరెడ్డి జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలి

ఆత్మకూర్(ఎస్), ఏప్రిల్ 12: విద్యార్థి నాయకుడు జార్జిరెడ్డి జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలని పీడీఎస్‌యూ సూర్యాపేట డివిజన్ కార్యదర్శి పిడమర్తి భరత్ అన్నారు. జార్జిరెడ్డి 52వ వర్ధంతి కార్యక్రమాన్ని శుక్రవారం మండలంలోని ఏపూర్ గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జార్జిరెడ్డి చిత్రపటానికి ఆయన నివాళులర్పించి మాట్లాడారు. జార్జిరెడ్డి స్ఫూర్తితో మతోన్మాదాన్ని ఓడిస్తేనే ఆయన నిజమైన నివాళి అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు ఎస్‌కే రహీం, వంశీ, గణేష్, వేణు, వెంకీ, తదితరులు పాల్గొన్నారు.

ఐదు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

అనంతగిరి, హుజూర్‌నగర్, ఏప్రిల్ 12: అనంతగిరి, హుజూర్‌నగర్ మండలాల్లో ఐదు ఇసుక ట్రాక్టర్లను పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. అనంతగిరి ఎస్ఐ నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పాలేరు వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న నాలుగు ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని సీజ్ చేసినటు తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్లు కొండబాల అజయ్‌రాజు, నెల్లూరి నరేష్, నెల్లూరి బాలకోటయ్య, నెల్లూరి గోపీపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

● హుజూర్‌నగర్ ఎస్ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చిల్లేపల్లి వాగు నుంచి హుజూర్‌నగర్‌కు ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను గోపాలపురం శివారులో పట్టుకుని సీజ్ చేసినట్లు తెలిపారు. బూరుగడ్డకు చెందిన ఆవుల వీరయ్య ట్రాక్టర్ ద్వారా ఇసుక రవాణా చేస్తున్నారని తెలిపారు.

రూ.10వేల విలువైన మద్యం బాటిళ్లు స్వాధీనం

హుజూర్‌నగర్, ఏప్రిల్ 12: మండలంలోని గోపాలపురంలో బెల్ట్ షాపుతో పోలీసులు శుక్రవారం తనిఖీలు చేశారు. ఎస్ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. గోపాలపురానికి చెందిన సత్యనారాయణ, పిచ్చమ్మ కిరాణ షాపులో నిల్వచేసిన రూ.10వేల విలువైన మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకుని సీజ్ చేశామన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

సంక్షిప్త సమాచారం

సూర్యాపేట టౌన్: పట్టణానికి నీటిని సరఫరా చేసే మిషన్ భగీరథ పైప్‌లైన్లకు గరిడేపల్లి సమీపంలో మరమ్మతు చేస్తున్నందున శనివారం సాయంత్రం నుంచి ఆదివారం ఉదయం వరకు పట్టణంలో నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని మునిసిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

గరిడేపల్లి: మండలంలోని గరిడేపల్లి, కల్మలచెర్వు గ్రామాల పరిధిలోని 33/11కేవీ ఫీడర్ లైన్ల తీగలకు అడ్డుగా ఉన్న కొమ్మలను తొలగిస్తున్నందున శనివారం ఉదయం ఏడు గంటల నుంచి 10గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ నగేష్ తెలిపారు.

మఠంపల్లి: మండలంలోని వర్ధాపురం, పెదవీడు గ్రామాల ఫీడర్ పరిధిలోని విద్యుత్ తీగల కింద ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తున్నందున శనివారం ఉదయం ఏడు గంటల నుంచి 10గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ హరీష్‌రెడ్డి తెలిపారు.

మేళ్లచెర్వు: మేళ్లచెర్వు, కందిబండ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తున్నందున సోమవారం ఉదయం ఏడు గంటల నుంచి 10గంటల వరకు విద్యుత్‌ను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ వెంకటేశ్వర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

కోదాడ రూరల్: దొరకుంట 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడానికి నెమలిపురి, దొరకుంట గ్రామాలు, ఏజీఎల్, దొరకుంట ఇండస్ట్రీయల్ ఫీడర్లలో శనివారం ఉదయం ఎనిమిది గంటల నుంచి 10గంటల వరకు విద్యుత్‌ను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ ఆర్.శ్రీనివాసరావు తెలిపారు.

మునగాల రూరల్: మండలంలోని తిమ్మారెడ్డిగూడెం సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తున్నందున గణపవరం, తిమ్మారెడ్డిగూడెం, కొక్కిరేణి గ్రామాల్లో శనివారం ఉదయం ఏడు గంటల నుంచి 10గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ ఏఈ వికాస్ ఒక ప్రకటనలో తెలిపారు.

తిరుమలగిరి రూరల్: మండలంలోని వెలిశాల సబ్‌స్టేషన్ పరిధిలోని వెలిశాల, చింతలకుంటతండ, మల్రికుంటతండ, తొండ గ్రామ పరిధిలో దాసుబావి వద్ద చెట్ల కొమ్మలను తొలగిస్తున్నందున శనివారం ఉదయం ఆరు గంటల నుంచి 10గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ వేణుగోపాల్‌రావు తెలిపారు.

ఆత్మకూర్(ఎస్): మండలంలోని పాత సూర్యాపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు ముసుగు సంజీవరెడ్డి శుక్రవారం మృతి చెందాడు. ఆయన మృతదేహానికి మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంజీవరెడ్డి మృతి పార్టీకి తీరని లోటని అన్నారు. అన్నారు. సంజీవరెడ్డి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కొప్పుల వేణారెడ్డి పాల్గొన్నారు.

మేళ్లచెర్వు: ప్రజలందరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని కోదాడ రూరల్ సీఐ రజితారెడ్డి అన్నారు. శాంతిభద్రతలపై చింతలపాలెం మండలంలోని తమ్మవరం గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. చింతలపాలెం మండలంలోని తమ్మవరం, నక్కగూడెం, కిష్టాపురం, వీక్లానాయక్ తండాలో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ సైదిరెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాగారం: నాగారం మండల కేంద్రంతో పాటు వర్ధమానుకోట గ్రామంలో స్థానిక పోలీసులతో కలిసి కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి. ఈ సందర్భంగా నాగారం సీఐ రఘువీర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికలను సజావుగా జరిగేందుకు ప్రజలు సహకరించాలిన, స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాగారం ఎస్ఐ పి. వెంకట్‌రెడ్డి, కానిస్టేబుల్ యల్లయ్య, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

● ఎక్స్‌పోజర్ విజిట్‌లో భాగంగా నాగారం మండలంలోని ఫణిగిరి బౌద్ధ క్షేత్రాన్ని నడిగూడెం గురుకుల విద్యార్థులు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ఇన్‌చార్జి సీహెచ్ ధనమ్మ మాట్లాడుతూ నడిగూడెం గురుకుల పాఠశాల పీఎం విద్యానిధి పథకానికి ఎంపికైనందున దేశంలోని చారిత్రక ప్రదేశాలను తిలకించడానికి విద్యార్థులకు అవకాశం వచ్చిందన్నారు. దీంతో ఫణిగిరి బౌద్ధ క్షేత్రాన్ని సందర్శించామని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రజని, సునిత, నిర్మల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

తుంగతుర్తి: ఎండ వేడిమి ఎక్కువగా ఉన్నందున విద్యార్థులు, ప్రజలు ఉదయం 11గంటల తర్వాత ఇళ్ల నుంచి బయటికి రావొద్దని మండల ఆరోగ్య విస్తరణ అధికారి సముద్రాల సురేందర్ సూచించారు. వడదెబ్బ తగలకుండా, సీజనల్ జ్వరాలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తుంగతుర్తిలోని ప్రభుత్వ హాస్టల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు గాజుల సోమయ్య, యాదగిరి, హాస్టల్ ఆరోగ్య సిబ్బంది సరిత, కల్యాణి, వసంత, మంజుల పాల్గొన్నారు.

చిలుకూరు: విద్యార్థులు వివిధ రంగాల్లో నైపుణ్యాలను పెంపొందించుకుని అనుకున్న లక్ష్యాలను సాధించాలని ప్రిన్సిపాల్ డాక్టర్ ఉమామహేశ్వర్‌రావు అన్నారు. మండలంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు వివిధ సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో ఉద్యోగులుగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు కళాశాల స్థాయిలోనే అవగాహన, సంభాషణ నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. మిట్స్ కళాశాలలో విద్యార్థులకు క్యాంపస్ ప్లేస్‌మెంట్లు కూడా నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మిట్స్ కళాశాల సెక్రటరీ మధిర ప్రీతిరెడ్డి, వైస్ చైర్మన్ గౌతంరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ నర్సిరెడ్డి, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.